కొత్తవలస రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం

కొత్తవలస, ఆగస్టు 23 : కొత్తవలస రైల్వేస్టేషన్‌ను శుక్రవారం వాల్తేరు డివిజనల్ మేనేజర్ సౌరబ్‌ప్రసాద్ సందర్శించారు. ఈ రైల్వేస్టేషన్‌ను కేంద్ర ప్రభుత్వం అమృత్‌భారత్ రైల్వేస్టేషన్‌గా గుర్తించింది. ఇందుకు సంబంధించి స్టేషన్‌లో కొన్ని అభివృద్ధి పనులు కూడా చేస్తున్నారు. అవి ఆలస్యంగా జరుగుతున్నాయని, వేగవంతం చేయాలని సౌరబ్‌ప్రసాద్ సూచించారు. స్టేషన్ పరిసరాలను పర్యవేక్షించి సిబ్బందికి నిర్వహణపై సూచనలు ఇచ్చారు. డీఆర్ఎం వెంట స్థానిక రైల్వేశాఖ అధికారులు ఉన్నారు.

వేటు మొదలైందా!

- అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో కదిలిన డొంక
- ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు
- సస్పెండ్ చేస్తూ ఆ శాఖ డీఐజీ ఆదేశాలు
- మిగతా వారిలో ఆందోళన



ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): తీగ లాగితే డొంక కదులుతోంది. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌లో అవకతవకలకు పాల్పడిన అధికారులపై వేటు పడుతోంది. శృంగవరపుకోట సబ్ రిజిస్ట్రార్ శ్యామలపై సస్పెన్షన్ వేటు వేస్తూ స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ విజయలక్ష్మి ఈనెల 22న ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఘటనతో మిగతా వారిలో టెన్షన్ మొదలైంది. వైసీపీ హయాంలో నిషేధిత భూములు, ప్రభుత్వ స్థలాలపై అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని కొందరు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా జిల్లాలో పర్యటించారు. ఎస్.కోట, భోగాపురం, గజపతినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించారు. వివాదాస్పద భూములను పరిశీలించి భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్టు గుర్తించారు. అందులో భాగంగానే ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్‌పై వేటు వేసినట్టు తెలుస్తోంది.

ఏం జరిగిందంటే..

ప్రభుత్వం పంపిణీ చేసి 20 సంవత్సరాలు పూర్తయిన డీపట్టాదారులకు ఆ భూములపై హక్కులు కల్పిస్తూ వైసీపీ ప్రభుత్వంలో జీవో జారీచేసిన సంగతి తెలిసిందే. ఈ జీవో ప్రకారం ఉమ్మడి జిల్లాలో అర్హత సాధించిన పట్టాదారు భూములు 21 వేల ఎకరాల వరకూ ఉన్నాయి. అయితే తొలి విడతలో 11,025 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తూ అనుమతి ఇచ్చింది. అయితే ప్రభుత్వ జీవో వస్తుందని తెలిసి కొందరు వైసీపీ పెద్దలు ముందుగానే ప్లాన్ చేశారు. ఒక పథకం ప్రకారం భూయజమానులకు కొంతమొత్తం అందించి ఒప్పంద పత్రం రాయించుకున్నారు. అయితే దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మూడు నెలల పాటు నిలిపివేసింది. అయితే జిల్లాలో మాత్రం 214 ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఇందులో రెవెన్యూతో పాటు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు, సిబ్బంది పాత్ర ఉంది. దీనిని తేల్చేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా ఇటీవల జిల్లాలో పర్యటించారు. స్వయంగా కొన్ని లోపాలను గుర్తించి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ప్రస్తుతం అటు రెవెన్యూ, ఇటు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖాపరంగా లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ పాత్ర స్పష్టంగా బయటపడడంతో ఆమెపై వేటు పడింది.

ముందస్తు ఒప్పందాలు..

ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం జీవో జారీచేస్తుందని కొంతమంది నేతలకు తెలుసు. అందుకే ఎక్కడికక్కడే ముందస్తు ఒప్పందాలు చేసుకున్నారు. ముఖ్యంగా విశాఖ జిల్లా సరిహద్దు మండలాల్లోని భూములపైనే కొందరు వైసీపీ నేతలు కన్నేశారు. భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణం నేపథ్యంలో అక్కడి భూముల ధరలు భారీగా పెరిగాయి. ఇటు ఎస్.కోట మండలంలో సైతం భూముల ధరలు భారీగా ఉన్నాయి. అందుకే అక్కడ డీపట్టాదారులతో ముందుగానే మాట్లాడుకున్నారు. ఎకరా రూ.2 కోట్లు ధర ఉన్న చోట.. రూ.25 లక్షలు అందించేందుకు ఒప్పందం చేసుకున్నారు. కొందరి అవసరాలకు ముందుగానే డబ్బు సమకూర్చారు. జిల్లాలో అత్యధికంగా ఎస్.కోటలో 98.32 ఎకరాల ఫ్రీహోల్డ్ భూమి రిజిస్ట్రేషన్ అయినట్టు తెలుస్తోంది. భోగాపురంలో 41 ఎకరాలు, గజపతినగరంలో 39.99 ఎకరాలు, విజయనగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 10.38 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలుస్తోంది. ఎస్.కోటలో దాదాపు 100 ఎకరాలు చేతులు మారడం గమనార్హం.

పనితీరుపై విమర్శలు..

జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనితీరుపై విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 11 చోట్ల కార్యాలయాలుండగా కొన్నిచోట్ల సాయంత్రం 6 దాటితేనే కొన్ని రకాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి. నమ్మకస్తులైన డాక్యుమెంట్ రైటర్లు, దళారులు సాయంత్రం 6 గంటలు దాటితే తమ పని కానిచ్చేస్తుంటారని బహిరంగంగానే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. క్రయ, విక్రయదారులను కార్యాలయంలోకి రాకుండా కట్టడి చేస్తుంటారు. కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు ఇట్టే ప్రవేశించి చక్కగా రిజిస్ట్రేషన్లు చేయిస్తుంటారు. తనిఖీల సమయంలో వీరు జాగ్రత్తపడతారు. తరువాత పరిస్థితి షరా మామూల్లే.

నిర్ణయం గ్రామస్థులదే

- ఎంపిక చేసిన పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలి
- దుప్పాడ గ్రామ సభలో కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం రూరల్/ గంట్యాడ, ఆగస్టు 23: ఉపాధి పనుల ఎంపిక విషయంలో గ్రామస్థులదే తుది నిర్ణయమని, గ్రామ, ప్రజావసరాల మేరకు పనులు చేపట్టాలని, వాటిని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. ఉపాధి హామీ పథకం పనుల ఎంపిక విషయమై శుక్రవారం దుప్పాడలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2006 నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్నో వేల కోట్ల విలువైన పనులు చేపట్టారని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఒకే రోజు అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహించడం హర్షణీయన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనులు ఎంపిక చేసుకుని, వాటిని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. అన్ని గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, ఉపాధి పనుల విషయంలో గ్రామ సభలదే నిర్ణయాధికారమన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా, మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, ఎంపీడీవో గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ కృష్ణవేణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, జనసేన పార్టీ నాయకురాలు పాలవలస యశస్విని, టీడీపీ నాయకుడు గంటా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై మీరే చర్చించుకోవాలి: కలెక్టర్

గ్రామంలోని ప్రతి ఇంటికీ కనీస అవసరాలు తీర్చడం, సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రజల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన ద్వారా స్వర్ణగ్రామాలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ లోనూ కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామ అవసరాలు ఏమిటి, ఏ పనులు గ్రామానికి ఉపయోగకరం అనే అంశాలపై చర్చించి ప్రజలంతా కలిసి సమష్టిగా ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. గ్రామంలోని ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ సభ పెడతామని, అందరూ హాజరై వ్యక్తిగత, ఇంటి అవసరాలు, గ్రామ అభివృద్ధిపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. గ్రామంలోని సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనాలను వెంటనే పూర్తిచేయాలని గ్రామానికి చెందిన యువకుడు శ్రీనివాస్‌తోపాటు మాజీ ఎంపీటీసీ బంగారయ్య కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.పాపునాయుడు, ఎంపీటీసీ భవాని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ ఇక్కడే

- ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

మెంటాడ ఆగస్టు 23: ప్రతిష్ఠాత్మక గిరిజన యూనివర్సిటీ వేరేచోటుకు తరలుతుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటినవలస గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలుత నిర్ణయించిన కొత్తవలస మండలం రెల్లి గ్రామానికి తరలించనున్నారని వస్తున్న వార్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తోసిపుచ్చారని సంధ్యారాణి తెలిపారు. శంఖుస్థాపన జరిగిన చోటే పూర్తి చేస్తామని కూడా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని సంధ్యారాణి వెల్లడించారు. రాష్ట్రంలో వైసీపీ హయంలో ధ్వంసమైన పంచాయతీ రాజ్ వ్యవస్థకు గత వైభవం తీసుకురావడమే గ్రామసభల ఉద్దేశమని ఆమె చెప్పారు. వైసీపీ త్వరలోనే ఖాళీ అవుతుందని, జగన్ మినహా ఆ పార్టీలో ఎవరూ మిగలరని ఎద్దేవా చేశారు. సభలో తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎంపిడివో పి.త్రివిక్రమ రావు, ఏపీవో చినఅప్పయ్య, సర్పంచ్ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలు విజయవంతం

విజయనగరం (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కింద 2024-25లో చేపట్టనున్న పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 775 గ్రామ పంచాయతీల్లోనూ శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కార్యదర్శులు ఉపాధి పనులు, ప్రాధాన్యతలను తొలుత వివరించారు. ఈ ఏడాది చేపట్టనున్న పనుల గురించి గ్రామసభలో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సభకి ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు. మండల పరిషత్ అధికారులు, ఈఓపీఆర్‌డీలు పర్యవేక్షించారు. తహసీల్దార్‌తో పాటు వివిధ ప్రభుత్వశాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులను సభ ముందుంచి ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. అభ్యంతరాలు లేకపోవడంతో పనులకు ఆమోదం తెలపాలని అధికారులు కోరగా గ్రామ ప్రజలు చప్పట్ల ద్వారా అంగీకారం తెలిపారు. మంత్రి గుమ్మడి సంధార్యాణి మెంటాడ మండలం కుంటిన వలస గ్రామసభలో పాల్గొనగా కలెక్టర్ అంబేడ్కర్ విజయనగరం మండలం దుప్పాడ, గంట్యాడ మండలం పేదవేమలిలో సభలకు హాజరయ్యారు. శృంగవరపుకోట నియోజకవర్గం కొత్తవలస మండలం చింతలపాలెంలో మాత్రం గ్రామసభ రసాభాస అయింది.

సర్పంచ్‌పై వైసీపీ వర్గీయుల దాడి

- చింతలపాలెంలో ఎమ్మెల్యే సమక్షంలోనే ఘటన



గాయపడిన సర్పంచ్ సీతారామపాత్రుడు

కొత్తవలస, ఆగస్టు 23: చింతలపాలెంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎస్ఐ సుదర్శన రావు సమక్షంలోనే వైసీపీ నాయకులు దాడికి దిగారు. టీడీపీ సర్పంచ్ మాకెన సీతారామ పాత్రుడు(నవీన్)ను తీవ్రంగా గాయపర్చారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో తొలుత ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో పాటు గ్రామపెద్దలు సర్పంచ్ మాకెన సీతారామపాత్రుడు గ్రామంలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. చివరగా ఎమ్మెల్యే మాట్లాడాక సమావేశాన్ని ముగించి అధికారులందరూ వేదిక దిగిపోయే సమయానికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు కాయితపు బీష్మ తనకు మాట్లాడటానికి మైక్ ఇవ్వాలన్నారు. సమావేశం ముగించిన తరువాత మైక్ ఇవ్వాలంటే ఎలా అని సర్పంచ్ అనడంతో కోపోద్రిక్తుడైన బీష్మ, మరికొంతమంది యువకులు అక్కడే ఉన్న పోలీసు అధికారిని, మిగిలిన ప్రభుత్వ అధికారులను నెట్టేసి వేదికపైకి వచ్చి సర్పంచ్‌పై దాడి చేశారు. ఈ హఠాత్ పరిణామానికి అక్కడే ఉన్న ఎమ్మెల్యే, అధికారులు నిశ్చేష్టులయ్యారు. వెంటనే అందరూ కలిసి అడ్డుకున్నారు. అయితే అప్పటికే సర్పంచ్‌కు తీవ్ర గాయమైంది. కుడిచేయి విరిగిపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షణ్ముకరావు తెలిపారు.



మడ్డువలసకు జలకళ

వంగర, ఆగస్టు 23: వర్షాలకు మడ్డువలస రిజర్వాయర్‌కు జలకళ వచ్చింది. జలాశయం పరిసరాలతో పాటు ఎగువ ప్రాంతం ఒడిశాలో వర్షాలు విస్తారంగా కురుస్తుం డటంతో వేగావతి, సువర్ణముఖి నదుల్లో జల ప్రవాహం పెరిగింది. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయానికి 64.45మీటర్ల వద్ద ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 64.65మీటర్లకు చేరింది. అప్రమత్తమైన అధికారులు 6 ప్రధాన గేట్లు స్వల్పంగా తెరిచి నాగావళి నదిలోకి నీరు విడుదల చేశారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 65మీటర్లు అయినప్పటికీ నిర్వాసిత గ్రామాల్లో సమస్యలను దృష్టిలో పెట్టుకుని 64.50 మీటర్లకు నీటిమట్టాన్ని స్థిరీకరించారు. రెండు నదులద్వారా ఇన్‌ఫ్లో 8225 క్యూసెక్కులు మడ్డువలస రిజర్వాయర్‌కు వచ్చి చేరుతుండటంతో ఆరు గేట్ల నుంచి 13 వేల క్యూసెక్కుల నీరు నాగావళి నదిలోకి విడుదల చేశారు. ఇంకా నీరు పెరిగితే ప్రధాన గేట్లు కూడా తెరిచేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రాజెక్టు ఏఈ నితిన్ తెలిపారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



పూజలందుకుంటున్న సంతోషిమాత

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/చీపురుపల్లి/నెల్లిమర్ల, ఆగస్టు 23: శ్రావణ మాసం మూడో శుక్రవారం కూడా భక్తులు విశేష పూజలు చేశారు. మహిళలు నిష్ఠగా వరలక్ష్మీదేవిని ఆరాదించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. విజయనగరం సంతోషిమాత, కన్యాకాపరమేశ్వరి, పైడితల్లమ్మ ఆలయాల్లో శ్రావణ శోభ సంతరించుకుంది. ఉదయం నుంచి భక్తులు అమ్మ వార్లను దర్శించుకుంటూ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రతిచోటా భక్తులు బారులు తీరారు. చాలా మంది భక్తులు ఇంటిలోనే పూజగదిలో లక్ష్మీదేవి, గౌరిదేవి, వరలక్ష్మీదేవిల చిత్రాపటాలను అలంకరించి వ్రతాలు, పూజలు నిర్వహించారు.

108 చీరలతో అమ్మవారికి అలంకరణ

శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా చీపురుపల్లిలోని కనకమహలక్ష్మి అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని 108 చీరలతో అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. పరసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ఈవో జి.శ్రీనివాస్, అర్చకులు ఆరవెల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రామతీర్థంలో లక్ష కుంకుమార్చన

నెల్లిమర్లలోని పవిత్ర పుణ్యక్షేత్రం రామచంద్రస్వామి దేవాలయం (రామతీర్థం)లో శ్రావణమాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని స్వామికి ఫల, పుష్పార్చన, మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై లక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. దేవాలయంలో ప్రాతఃకాల అర్చన, బాలభోగం నిర్వహించి రామచంద్ర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కళ్యాణ మండపంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు, రామతీర్థం సేవా పరిషత్ సంఘ సభ్యులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, ఆల్తి శ్రీనివాసరావు, లెంక అప్పలనాయుడు, తిరిపతిరావు, సత్యనారాయణరావు, ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రామతీర్థంలో కుంకుమార్చనలో అర్చకులు

స్పష్టతొచ్చింది..

- బదిలీల ప్రక్రియలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకూ అవకాశం
- ప్రత్యేకంగా శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

శృంగవరపుకోట, ఆగస్టు 23: ఈనెల 17న 15 శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం బదిలీ అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులూ ఉన్నారు. అయితే గ్రామ వార్డు సచివాలయాల్లో సుమారు 12 రకాల శాఖలకు చెందిన ఉద్యోగులు పనిచేస్తున్నారు. విద్య, వైద్య, వ్యవసాయ అనుబంధ శాఖలు ఇందులో ఉన్నప్పటికీ ఆ బదిలీ ఉత్తర్వుల్లో మినహాయింపు ఇచ్చారు. దీంతో ఆ ఉద్యోగులంతా అయోమయానికి గురయ్యారు. సందిగ్ధంలో వున్న వీరికి శుక్రవారం ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న అన్నిశాఖల ఉద్యోగులకూ బదిలీలు చేస్తున్నట్లు సర్క్యులర్ జారీ చేసింది.

గత వైసీపీ ప్రభుత్వం నూతనంగా గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకొచ్చింది. పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్ (ఎఎన్ఎం), మహిళ పోలీస్, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్, ఇంజినీరింగ్ మరియు ఎనర్జీ అసిస్టెంట్ ఇలా 12 రకాల శాఖలకు చెందిన ఉద్యోగులను నియమించారు. 2019 నవంబర్‌లో విధుల్లో చేరిన వీరికి 2022 జూలైలో ప్రొబేషన్‌ను ప్రభుత్వం డిక్లయిర్ చేసింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులంతా ఒకేసారి చేరడంతో దాదాపుగా అందరికీ ఒకే రకమైన సర్వీస్ ఉంటుంది. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న అన్ని శాఖల ఉద్యోగులకు బదిలీలు వున్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారులు బదిలీ బాధ్యతలను నిర్వహించనున్నారు. ఐటీడీఏ పరిధిలో రెండేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఉద్యోగులకు తొలుత ప్రాధాన్యం ఉంటుంది. ఆ తరువాత వెనకబడిన ప్రాంతాలకు, మైదాన ప్రాంతాలకు ప్రాధాన్యక్రమంలో బదిలీ చేస్తారు. ఐదేళ్ల పూర్తికాకపోయినా బదిలీ జరిగే అవకాశం వుంది. పరిపాలన సౌలభ్యం కోసం ఏ ఉద్యోగినైనా బదిలీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగే ఈ ప్రక్రియలో సొంత గ్రామం, పంచాయతీలకు బదిలీ ఇవ్వరు. తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 27లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించేందుకు చివరి తేది. ఈనెల 28న సీనియార్టీ జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 29నుంచి 30 వరకు బదిలీలకు కౌన్సెలింగ్ ఉంటుంది. కౌన్సెలింగ్ సమయంలో తప్పనిసరిగా ఉద్యోగి హాజరుకావాల్సి ఉంటుంది. ఈనెల 30న కలెక్టర్ బదిలీ ఉద్యోగులకు ఉత్తర్వులు జారీచేస్తారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల దరఖాస్తులు చేసుకోనేందుకు హెల్ప్‌లైన్ నెంబర్‌లను సూచించారు. 9010656383,7981927494,8309961905 నెంబర్‌లకు ప్రతిరోజు ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు సంప్రదించవచ్చు.



ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శ్రీకాకుళం • శనివారం • 24 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



మహేశ్ సినిమా పేరు అదేనా?

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో డా.కె.ఎల్.నారాయణ నిర్మించే చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మహేశ్ పుట్టినరోజున సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వస్తుందని ఆశగా ఎదురు చూసిన ఆయన అభిమానులు ఏదీ రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ సినిమా ఉంటుందన్న సమాచారం తప్ప కొత్త వార్తలేమీ బయటకు రావడం లేదు. సినిమా టీమ్ మాత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో సీరియస్‌గా నిమగ్నమై ఉంది. ఇటువంటి నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. విజువల్ డెవలప్‌మెంట్ ఆర్టిస్ట్ టీపీ విజయన్ తన ఇన్‌స్టా స్టోరీస్‌లో బంగారు వర్ణంలో ఉన్న గద్ద రెక్కలు ఉంచి మహేశ్ సినిమా టైటిల్ ఇదే అని అర్థం వచ్చేలా పోస్ట్ చేయడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పెట్టవచ్చు అనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. గతంలో దర్శకుడు రాజమౌళి 'బాహుబలి' తర్వాత తను చేయబోయే ప్రాజెక్ట్ 'గరుడ' అని వెల్లడించారు. ఆ ప్రాజెక్ట్ ఇదే అయి ఉంటుందని, సినిమాకు 'గరుడ' అని పేరు పెడతారని సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. మహేశ్ చిత్రానికి 'గరుడ' టైటిల్ ఖాయమో కాదో అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

సమంతకు ఏమైంది?




సిటాడెల్ వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించనున్నారు సమంత. ఆమె సినిమాలు తగ్గించినా.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. అలానే అప్పుడప్పుడు పలు ఈవెంట్లలో పాల్గొని ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తుంటారు. అయితే ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమానికి సమంత బ్లాక్ డ్రస్సులో వచ్చారు. ఈ సందర్భంగా తీసుకున్న వీడియోను ఆమె అభిమానులతో సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఇక అప్పటి నుంచి అభిమానుల కామెంట్లు మొదలైయ్యాయి. 'సమంతకు ఏమైంది... ఆమె మునుపటిలా ఎందుకు అందంగా కనిపించట్లేదు. బరువు తగ్గినట్లుంది. ముఖంలో ఆనందం కనిపించట్లేదు' అని పలువురు అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు.

రవితేజకు శస్త్ర చికిత్స



హీరో రవితేజ కుడిచేతికి సర్జరీ జరిగింది. చికిత్స చేసిన వైద్యులు ఆయనని ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. 'ఆర్‌టీ75' సినిమా చిత్రీకరణలో రవితేజకు ఇటీవలే స్వల్ప గాయమైంది. ఆ గాయాన్ని లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. దాంతో ఆ గాయం మరింత పెద్దదవ్వడంతో డాక్టర్లు సర్జరీ చేశారు. కాగా, 'సామజవరగమన' చిత్రానికి రచయితగా పనిచేసిన భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

అలా కామెంట్ చేసినందుకు చింతిస్తున్నా



హీరో నాని నటించిన తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'ఆ వ్యాఖ్యల వల్ల అర్షద్‌కు ఎప్పుడూ రానంత ఫేమ్ వచ్చింది" అని అన్నారు. అయితే ఇప్పుడా మాటలు సోషల్‌మీడియాలో హాట్ టాపిక్కయ్యాయి. ఆ మాటల వల్ల సోషల్‌మీడియాలో అభిమానులు నాని వర్సెస్ అర్షద్ అంటూ రెండు వర్గాలుగా చీలిపోయారు. తాజాగా, 'సరిపోదా శనివారం' ప్రమోషన్స్ కోసం ముంబై వెళ్లిన నాని.. తాను అర్షద్‌పై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. "అర్షద్ చాలా గొప్ప నటుడు. ఆయన గురించి అలా మాట్లాడినందుకు బాధపడుతున్నాను. నటులుగా ఉన్నప్పుడు మాట్లాడే ప్రతీ మాట విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అవి వైరల్ అయ్యి ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రభాస్‌పై అర్షద్ చేసిన వ్యాఖ్యల్లో.. అర్షద్‌పై నేను చేసిన వ్యాఖ్యల్లో ఆ పొరపాటే జరిగింది. నిజానికి నేను అర్షద్‌ని అలా అనాలనుకోలేదు. నా మాటలు సోషల్‌మీడియా ద్వారా అలా తప్పుదోవ పట్టాయి. నేను ఆయనపై అలా మాట్లాడినందుకు వచ్చిన రియాక్షన్స్‌ను చూసి అర్షద్ పూర్తి ఇంటర్వ్యూ చూశాను. అందులో ఆయన మాట్లాడిన మాటలు తప్పుదోవ పట్టాయని అర్థమైంది. అదే విధంగా నా వ్యాఖ్యలు కూడా మరో రకంగా ప్రజల్లోకి వెళ్లాయి" అని పేర్కొన్నారు.

హేమపై నిషేధాన్ని తొలగించిన 'మా'



నటి హేమ ఊపిరి పీల్చుకున్నారు. ఆమెపై 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) నిషేధాన్ని తొలగించింది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. మేలో జరిగిన ఓ రేవ్ పార్టీలో ఆమె డ్రగ్స్ తీసుకుందని.. పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నిర్ధారణ కావడంతో ఆమెపై 'మా' సస్పెన్షన్ విధించింది. అయితే ఆమె అందులో నిరపరాధినని పేర్కొంటూ.. ఓ ల్యాబ్‌లో మెడికల్ టెస్టులు చేసుకుని ఆ నివేదికల్ని మంచు విష్ణుకు ఓ లేఖతో పాటు అందించారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన 'మా' ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

సినీటాకు మంచు విష్ణు లేఖ

ప్రభాస్‌పై బాలీవుడ్ అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో తెలిసిందే. ఈ వివాదంపై స్పందిస్తూ.. మంచు విష్ణు 'మా' తరపున 'సినీటా' (సినిమా అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షురాలు పూనమ్ ధిల్లాన్‌కు లేఖ రాశారు. "ప్రతీ ఒక్కరికి నచ్చినట్లు మాట్లాడే స్వేచ్ఛ ఉంది. కానీ ప్రభాస్‌ని కించపరుస్తూ అర్షద్ చేసిన వ్యాఖ్యల వల్ల అభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సినీనటుల ఐక్యత, గౌరవాన్ని కాపాడటంలో ఎల్లప్పుడూ ముందుండే 'సినీటా'.. ఈ వివాదంపై స్పందిస్తుందని ఆశిస్తున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో మరోసారి పునరావృత్తం కాకుండా తగిన సూచనలు అర్షద్‌కు చేస్తారని ఆశిస్తున్నాను. మనమంతా ఒకే కుటుంబం. ఆ ఐక్యతను కొనసాగిద్దాం" అని లేఖలో పేర్కొన్నారు.

'ఎమర్జెన్సీ'ని బ్యాన్ చేయాల్సిందే!

సిక్కుల డిమాండ్



కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఇప్పుడు మరో వివాదంలో చిక్కుకుంది. సెప్టెంబర్ 6న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే సిక్కుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా 'ఎమర్జన్సీ' చిత్రం ఉందనీ, సిక్కులకు వ్యతిరేకంగా రూపుదిద్దుకున్న ఈ సినిమాను వెంటనే బ్యాన్ చేయాలనీ, విడుదల చేయడానికి వీల్లేదని శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అకల్ తఖ్త్ డిమాండ్ చేశాయి. ఎస్‌జీపీఎస్ చీఫ్ హర్‌జిందర్ సింగ్ ధామి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కంగనను తీవ్రంగా విమర్శించడమే కాకుండా ఆమెపై కేసు పెట్టాలని కూడా కోరారు. సిక్కులను వ్యతిరేకించే సన్నివేశాలు ఈ మధ్య సినిమాల్లో ఎక్కువ అయ్యాయనీ, అందుకే సెన్సార్‌బోర్డ్‌లో సిక్కులకు కూడా తగినంత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. 'ఎమర్జెన్సీ' చిత్రం తీస్తున్నట్లు 2021లో కంగనా ప్రకటించినప్పటి నుంచీ ఈ సినిమాకు చిక్కులే. ఇందులో ఆమె మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషిస్తూ, దర్శకత్వం వహించారు. ఇది ఇందిరాగాంధీ బయోపిక్ కాదనీ, ఓ పొలిటికల్ డ్రామా అని ఎన్నోసార్లు కంగనా వెల్లడించానా వివాదాలు ఈ సినిమాను వదల్లేదు. ఎన్నో అవరోధాలు తట్టుకుని, విడుదలకు సిద్ధం చేస్తే ఇప్పుడు సిక్కుల నుంచి కంగనాకు ప్రతిఘటన ఎదురైంది.

పెళ్లిపీటలపై మరో హీరోయిన్!



తెలుగు హీరోయిన్లు వరుసగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ పెళ్లి అయిన రోజునే అంటే గురువారం రాత్రే మరో హీరోయిన్ మేఘా ఆకాశ్, ఆమె చిరకాల ప్రియుడు సాయివిష్ణుల నిశ్చితార్థం కేరళలో జరిగింది. తమకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని గురువారం అర్ధరాత్రి వెల్లడించి, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది మేఘా ఆకాశ్. పెళ్లి ఎప్పుడన్నది మాత్రం ఆమె పేర్కొనలేదు. సాయివిష్ణు, మేఘా ఆకాశ్ ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నారట.

గ్రామాలకు మళ్లీ మహర్దశ

● విశాఖ ఎంపీ శ్రీభరత్ ● జిల్లా వ్యాప్తంగా పండగలా గ్రామ సభలు

కొత్తవలస, ఆగస్టు 23: గ్రామాలకు మళ్లీ మహర్దశ వచ్చిందని విశాఖపట్టణం ఎంపీ శ్రీభరత్ అన్నారు. శుక్రవారం కొత్తవలస నాలుగు సచివాలయానికి సంబంధించిన గ్రామ సభలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికోసం వేల కోట్ల రూపాయలను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా సీపీఎం, సీపీఐ నాయకులు ఉపాధికి సంబంధించిన పనిదినాలను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని, వేతనాన్ని 600 రూపాయలకు పెంచాలని కోరారు. కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి పనులకు ఆమోదం చేసి గ్రామాలను మెరుగుపరుచుకోవాలన్నారు.



కొత్తవలస: సమావేశంలో మాట్లాడుతున్న శ్రీ భరత్

బురదలో ద్విచక్రవాహనంపై..

● డీకేపర్తి గ్రామసభకు ఎంపీ కలిశెట్టి

గంట్యాడ: డీకేపర్తిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హాజరయ్యారు. అయితే రహదారి సదుపాయం లేని ఈ మారుమూల గిరిజన గ్రామానికి ఆయన కొంత దూరం నడిచి.. మరికొంత దూరం బురదలో ద్విచక్రవాహ నంపై ప్రయాణించి వెళ్లారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో భారీ పోలీసు బందోబస్తు నడుమ సభకు చేరుకున్నారు. గ్రామస్థుల సమస్య లను తెలుసుకున్నారు. అనంతరం అక్కడి పాఠ శాలను సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని, గ్రామంలోని సమస్యలను పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీడీవో భవాని, ఎస్ఐ సాయికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



బురదలో ద్విచక్రవాహనంపై గ్రామసభకు వెళ్తున్న ఎంపీ కలిశెట్టి

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి: బేబీనాయన

రామభద్రపురం: గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని కోటశిర్లాం గ్రామంలో శుక్రవారం మనపంచాయతీ-మన సాధికారత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడానికి అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆరికతోట గ్రామంలో వివిధ సమస్యలు, కాలువలు, కల్వర్టులు, పొలానికి నీరు వెళ్లే కాలువల నిర్మాణాలకు అంచనాలు వేసి నోడల్ అధికారి సత్యారావుకు అందించారు.

పంచాయతీల అభివృద్ధికి ముందడుగు: కోళ్ల

లక్కవరపుకోట: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగిన గ్రామసభలు గ్రామాల అభివృద్ధికి ముందడుగని ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం ఎల్.కోటలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ ప్రసాదరావు, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** గ్రామ సభల్లో గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారీ సూచించారు. మండ లంలోని బొద్దాం గ్రామ పంచాయితీలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే కోళ్ల ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. సర్పంచ్ యర్ర రామసత్యవతి, మాజీ సర్పంచ్ జనపరెడ్డి ఈశ్వరరావు, నాయకులు జనపరెడ్డి శ్రీను, పంచాయతీ కార్యదర్శి పద్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** పంచాయతీలను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం ఎస్.కోటలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. సర్పంచ్ సంతోష్‌కుమారి, ఉపసర్పంచ్ మోపాడ కుమార్ పలు ప్రతిపాదనలు వివరించగా వీటిపై ప్రత్యేక సమావేశం పెడదామన్నారు.

చంద్రబాబు పాలనలో గ్రామ స్వరాజ్యం : కొండ్రు

రాజాం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో గ్రామ స్వరాజ్యం మొదలయ్యిందని మాజీ మంత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ అన్నారు. శుక్రవారం మండలం శ్యాంపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు హజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్ కృష్ణంరాజు, పార్టీ నాయకులు సుమల మన్మథరావు, గురవాన నారాయణరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి: కళా

చీపురుపల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు విజ్ఞప్తి చేశారు. పీకే పాలవలసలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో కుప్పకూలిన పంచాయతీ రాజ్ వ్యవస్థకు జవసత్వాలు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, దన్నాన రామచంద్రుడు, కామునాయుడు, ఎంపీడీవో కె.రామ కృష్ణరాజు, ఈవోపీఆర్డీ కేఎస్ఎస్ అన్నపూర్ణాదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. చీపురుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, ఇతర అధికారులకు తెలుగుదేశం, జనసేన నాయకులు గ్రామ సమస్యలను వివరించారు.

అవసరమైన పనులకే తీర్మాణం: జేసీ

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి కే మధుసూదనరావు ఆధ్వర్యంలో విజయనగరం జేసీ సేతు మాధవన్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంతవరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మరుగుదొడ్లు, కుళాయిలు, విద్యుత్, వంటగ్యాస్ కనెక్షన్లు, మురుగునీరు, వీధి దీపాలు, సిమెంట్ రహదారుల గురించి ఎవరికైనా ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. గ్రామస్థుల వద్దనుంచి వినతులు తీసుకొని ఎలాంటి పనులు అవసరమో గుర్తించి తీర్మానాలు చేయాలని మండల ప్రత్యేక అధికారి కే మధుసూదనరావు కి ఆదేశించారు.



రామభద్రపురం: కోటశిర్లాం సభలో బేబీనాయన



ఎల్.కోట గ్రామ సభలో ఎమ్మెల్యే కోళ్ల



రాజాం: శ్యాంపురంలో కొండ్రు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు



బొబ్బిలి రూరల్: పారాధి గ్రామసభలో జేసీ

గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలి

కొత్తవలస: గర్భిణులు హెచ్ఐవీ, సిఫిలిస్ వంటి సుఖ రోగాలపై పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి సూచించారు. మండలంలోని వీరభద్రపురం గ్రామంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై వియ్యంపేట వైద్యాధికారి గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. గర్భిణులు ఈ పరీక్షలు ముందుగానే చేయించుకోవడం వలన పిల్లలకు సోకకుండా చర్యలు తీసుకునే వీలుందన్నారు.

సోమవారం గ్రీవెన్స్ రద్దు

కలెక్టరేట్: కృష్ణాష్టమి సెలవు కారణంగా ఈనెల 26న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్ సెల్) రద్దు చేస్తున్నట్టు డీఆర్వో అనిత ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

'బ్లీచింగ్ కొనుగోళ్లు పేరుతో పది లక్షలు స్వాహా'

జామి: మండలంలోని లోట్లపల్లి పంచాయతీలో గత ప్రభుత్వం గ్రామంలో ఎటువంటి శానిటేషన్ పనులు చేయించకుండా బ్లీచింగ్ కొనుగోళ్లకు సుమారు రూ.పదిలక్షలు ఖర్చుచేసినట్లు రికార్డులు చూపిస్తున్నారని దీనిపై జిల్లా పంచాయతీ అధికారి పూర్తిస్థాయి విచారణ జరిపి నిధులు దుర్వినియోగం చేసినవారిపై చర్యలు చేపట్టాలని గ్రామ యువత గ్రామసభకు వచ్చిన మండల ప్రత్యేకాధికారి రాంగోపాల్‌కు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా జన్నెల బాలకృష్ణ ఆధ్వర్యంలో వారు మట్లాడుతూ తాము సమాచార హక్కుచట్టం ప్రకారం తీసుకున్న వివరాల్లో ఈవిషయం బయటపడిందన్నారు. ఇదేవిషయంపై పంచాయతీ కార్యదర్శి ఎర్నమ్మ మాట్లాడుతూ బ్లీచింగ్‌కు పదిలక్షలు ఖర్చుపెట్టామనడం అవాస్తమమని, తమది చాలా చిన్నపంచాయతీ అని తెలిపారు. వారి ఆరోపణలు నజం కాదన్నారు.

ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడాలి

రాజాం రూరల్: ఉపాధ్యాయుల పనితీరు మరింత మెరుగుపడాలని మండల విద్యాశాఖాధికారి దుర్గారావు స్పష్టం చేశారు. బోధన తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గుయ్యానవలస పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రెండు భవనాలకు మరమ్మతులు చేయాల్సి ఉందని ఉపాధ్యాయులు చిరంజీవి, సృజన, ఎంఈవో దుర్గారావు దృష్టికి తీసుకువచ్చారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలికల హవా

రామభద్రపురం: ఈనెల 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆరికతోట జెడ్పీ పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలురలో ఎం.జ్యోతి ప్రకాష్, డి.రాఘవ, బాలికల్లో భువనేశ్వరి, మధురిమ, జయశ్రీలు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. వీరిని హెచ్ఎం శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించండి

విజయనగరం రూరల్: స్థానిక పద్మావతి నగర్‌కు చెందిన కరక నాగరత్నం తాను నివసిస్తున్న పద్మావతి నగర్ బిట్-1, ప్లాట్ నెం 225లో ఉన్న ఇంటి స్థలానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోలగట్ల, ఆయన అనుచరులు ఈ స్థలం ఖాళీ చేయాలని పదే పదే ఒత్తిడి తెచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో తాను నివాసం ఉంటున్న ఇంటికి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు అండగా టీడీపీ

రాజాం: అచ్యుతాపురంలో చోటుచేసుకున్న ప్రమాదంలో గాయపడిన వంగర మండలం కోణింగిపాడు గ్రామానికి చెందిన కొవ్వాడ సూర్యనారాయణను కొండ్రు మురళీమోహన్ శుక్రవారం రాత్రి విశాఖలో గల ఇండస్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ముగ్గురు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

ఫార్మా యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

విజయనగరం దాసన్నపేట: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మాసిటీలో 18 మంది మృతికి కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎ సురేష్, ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి కార్యాలయ ప్రతినిధికి వినతిపత్రం అందించారు.

ప్రధాన పనులకు ప్రతిపాదనలివ్వండి

రాజాం: పనుల ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు ప్రతిపాదనలు అందజేయాలని కంచరాం యూత్ సభ్యులు గ్రామసభలో పెద్దలకు వినతిపత్రం అంద జేశారు. గెడ్డాపు అప్పలనాయుడు తదితరులున్నారు.

మంత్రి సత్యకుమార్ దృష్టికి సమస్యలు

● బొబ్బిలి కోటకు ఆహ్వానించి వివరించిన బేబీనాయన

బొబ్బిలి: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బొబ్బిలి కోటలోని తన నివాసానికి శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే బేబీనాయన ఆహ్వానించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలోని ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 50 పడకల ఆసుపత్రిగా బొబ్బిలి సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేశారని, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఆ పనులను పూర్తి చేయలేక అర్థాంతరంగా వదిలేసిందని మంత్రికి తెలిపారు. పరిపాలనా పరమైన అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యే బేబీనాయన మంత్రిని కోరారు. ఈ మేరకు స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.శశిభూషణరావుతో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు తెంటు రవిబాబు, పెంట సత్తిబాబు, కాకల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పార్వతీపురం మన్యం జిల్లా అధికార కార్యక్రమానికి శుక్రవారం హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని ఆయనను కలిసి గజపతినగరం ఏరియా ఆసుపత్రికి అదనపు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.



ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌కువినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ సజావుగా జరగాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. కొనుగోలుకు అవసరమగు వాహనాలు, గన్నీ సంచులు, హమా లీలు, తేమ యంత్రాలు, గొడౌన్ సామర్థ్యం, బ్యాంకు గ్యారంటీలు తూనిక యంత్రాలు తదితర సామగ్రిని నెల రోజుల ముందే ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు సంబంధించి ఆయా శాఖ అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈ ఏడాది 4.50 లక్షలు మెట్రిక్ టన్నులు పంట వస్తుందని అంచనా వేస్తున్నామని, ప్రభుత్వం 4 లక్షలు మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వ్యవసాయాధికారులు అత్యంత బాధ్యత గా పని చేయాలన్నారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన టైం లైన్ ప్రకారంగా ధాన్యం సేకరణ జరిగేలా సమన్వయంతో పని చేయాలన్నారు. రైస్ మిల్లర్లు సమస్యలపై బకాయిలపై ప్రభుత్వంకు లేఖ రాసి పరిష్కరించడం జరుగు తుందన్నారు. సమావేశంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మీనా కుమారి, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, డీఎస్‌వో మధుసూదనరావు తదితరులు ఉన్నారు.

డ్రగ్స్, గంజాయి నియంత్రణపై సదస్సు

బొబ్బిలి: సమాజంలో పెచ్చుమీరిపోతున్న అసాంఘిక కార్యకలాపాలను అణగదొక్కాలని నినదిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి లోకం శుక్రవారం బొబ్బిలి పట్టణంలో కదంతొక్కింది. అమ్మాయిలపై అత్యాచారాలను అరికట్టాలని, డ్రగ్స్, గంజాయి ఆనవాళ్లు లేకుండా పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీవేణుగోపాలస్వామి మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేరాలకు సంబంధించిన పలు చట్టాలు అమలులో ఉన్నాయని, వాటిపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆకతాయిలు నేరప్రవృత్తి కలిగిన వారిని దూరంగా ఉంచాలన్నారు. సేవను పెంపొందించుకోవాలన్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఏవ్యక్తి అయినా మహిళలపట్ల చెడు భావంతో చూడరాదన్నారు. సోదరభావం కలిగి ఉండాలన్నారు. ఇలాంటి దురాగతాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ నేత విజయగౌరి మాట్లాడుతూ పాలబుగ్గల పసిపిల్లలతో సహా 80 ఏళ్ల దాటిన వృద్ధులను సైతం విడిచిపెట్టకుండా కామాంధులు చెలరేగిపోతున్నారన్నారు. మన సమాజం ఎటుపోతోంది? అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లోవరాజు,ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, మణి కుమార్, శివ, జానీ, చరణ్, నాగరాజు, తేజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

బొబ్బిలి: స్థానికకోర్టు సముదాయంలో శుక్రవారం పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసు, ఎస్ఈబీ అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 14న జరగనున్న జాతీయలోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని పిలుపునిచ్చారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవా సమితి చైర్‌పర్సన్ ఎస్.అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణి రావు, డీఎస్పీ శ్రీనివాసరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహనమురళీకుమార్, కొల్లి సింహాచలం, ఇతర న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి దామోదరరావు

ఒకే వ్యక్తి.. 70 కేసులు

● చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై 70 కేసులు ఉన్నట్టు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు వివరాలివీ.. బాలాజీ నగర్‌లోని ఇందూ రెసిడెన్షియల్‌లో ఈ నెల 10న ఇంట్లోని వెండి వస్తువులు, 12న శ్రీనివాసా కళాశాల సమీపంలోని ఒక ఇంట్లో రూ.లక్ష విలువైన వాచీ, కొంత నగదు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేర కు నగరంలోని లాడ్జీలను, వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో తె లంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తట్టుపోతల బంగారం గ్రామా నికి చెందిన దుద్దెడ లింగం అనే వ్యక్తిని శుక్రవారం రైల్వే స్టేషన్ సమీపంలో అదుపు లోకి తీసుకున్నారు. అతనిని విచారించగా, దొంగతనాలకు పాల్పడినట్టు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.లక్ష విలువైన వాచీ, ఇయర్ ప్యాడ్స్, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిపై 70కి పైగా కేసులు ఉన్నాయని వెల్లడించారు. చాలా కేసుల్లో శిక్ష అనుభవించాడన్నారు. ఐదు నెలల క్రితం జైలు నుంచి బయటకు వచ్చి దొంగతనాలు చేస్తూ మళ్లీ పట్టుబడ్డాడు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన క్రైం ఎస్ఐ తారకేశ్వరరావు, హెచ్‌సీ అచ్చి రాజు, పీసీ గౌరీశంకర్, సిబ్బందిని డీఎస్పీ గోవిందరావు అభినందించారు.



నిందితుడితో సీఐ శ్రీనివాస్

పాముకాటుతో గొర్రెలు మృతి

తెర్లాం: మండలంలో వి.చిన్నయ్యపేటలో పాముకాటుకు గురై 3 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రైతు వెన్నెల రమణ, అప్పలస్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజులాగే గొర్రెలను మేతకు తీసుకెళ్లామని, గ్రామంలోని ఓ తోటలో గొర్రెలు మేస్తుండగా ఒక్కసారిగా 3 గొర్రెలు కుప్పకులాయని, వెళ్లి చూసేసరికి పక్కనుంచి పాము వెళ్తుండం గమనించామని వారు తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి-బోడసింగిపేట గ్రామాల మధ్య రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందినట్లు విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీరావు శుక్రవారం తెలిపారు. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, మృతునివద్ద ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం మహారాజ ఆసుపత్రిలో భద్ర పరిచామని, మృతుని చేతిపై ఇంద్రాదేవి అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9666122722, 9491813163 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

గరివిడి: గరివిడి రైల్వే స్టేషన్ సమీపంలో నెల్లిమర్ల వెళ్లే రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. మృతునికి సుమారు 64 సంవత్సరాలు ఉండవచ్చునని, కాషాయ రంగు పంచె, తెలుపు రంగు షర్టు ధరించాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

బొబ్బిలిలో జేసీ పర్యటన

● ఇసుక పంపిణీపై కొరడా ● కెమికల్ ఫ్యాక్టరీ పరిశీలన

బొబ్బిలి, ఆగస్టు 23: జేసీ సేతుమాధవన్ శుక్రవారం బొబ్బిలిలో సుడిగాలి పర్యటనతో అధికారులను, సిబ్బందిని పరుగులెత్తించారు. పారాదిలో గ్రామసభకు వెళ్లి వచ్చిన తరువాత స్థానిక గ్రోత్‌సెంటరులో గల బాలాజీ కెమికల్స్ ఫ్యాక్టరీని పరిశీలించారు. 2019 లో ఈ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి ఇద్దరు మృతి చెందగా మరికొంతమంది గాయపడిన సంగతి తెలిపారు. అనకాపల్లి సెజ్‌లో ఫార్మాకంపెనీల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో జేసీ బొబ్బిలిలో గల బాలాజీ కెమికల్స్‌ను తనిఖీ చేశారు. కార్మికులకు ప్రాణరక్షణ చాలా అవసరమని, ఇందులో ఎటువంటి రాజీ లేదని జేసీ హెచ్చరించారు. అగ్నిమాపక అనుమతుల కోసం ఈ కంపెనీ యాజమాన్యం చేసుకున్న దరఖాస్తును అగ్నిమాపక శాఖ అధికారి తిరస్కరించడంతో పూర్తిస్థాయి నిబంధనలతో దరఖాస్తు చేసుకోవాలని జేసీ సూచించారు. ● స్థానిక గ్రోత్‌సెంటరులో గల ఇసుకస్టాకు పాయింట్‌ను జేసీ రెండు రోజుల వ్యవధిలోనే మరోసారి తనిఖీ చేశారు. ఇసుక పంపిణీకి సంబంధించి జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీల ఆధ్వర్యంలో రూపొందించిన మార్గదర్శకాల మేరకే ఇసుక పంపిణీ జరగాలన్నారు. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలకు జీపీఎస్ అమలు చేయాలని జేసీ ఆదేశించారు. అనుమతి తీసుకున్నవారు మాత్రమే ఇసుక తరలిస్తున్న లారీని జేసీ నిలుపుదల చేశారు. ఇళ్ల నిర్మాణం చేస్తున్న వారు సెల్ఫీలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇసుక పంపిణీలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. ● బొబ్బిలి అర్బన్‌డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని వైస్‌చైర్మన్, ఇన్‌చార్జి హోదాలో జాయింట్ కలెక్టరు సందర్శించారు. తహసీల్దారు ఎం.శ్రీను, సీఐ సతీష్‌కుమార్, ఆర్ఐ కళ్యాణచక్రవర్తి, ఇతర రెవిన్యూ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.



బాలాజీ పరిశ్రమను పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

మద్యం మత్తులో వ్యక్తి మృతి

గుర్ల, ఆగస్టు 23: మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి సన్యాసినాయుడు(43) మద్యం మత్తులో మృతిచెందినట్లు శుక్రవారం పోలీసులు గుర్తించారు. గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి సన్యాసినాయుడుకు గోశాడ గ్రామానికి చెందిన సత్యవతితో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. మద్యానికి బానిస కావడంతో భార్యభర్తల మధ్య నిత్యం గొడవలు సాగుతున్నాయి. వీరి వివాదం పోలీస్‌స్టేషన్ వరకూ చేరింది. పెద్దలు ఇరువురినీ ఒప్పించే ప్రయత్నాలు సైతం చేస్తున్నారు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం సన్యాసినాయుడు ఇంటిదగ్గర కనిపించకుండా మద్యంమత్తులో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతుకుతున్నప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఈ క్రమంలో శుక్రవారం విశాఖ గ్రామీణ బ్యాంకు మేడమీదపై నుంచి దుర్వాసన రావడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి నాలుగురోజుల క్రితమే మద్యం ఎక్కువై చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతునికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతిగృహ విద్యార్థికి పాము కాటు

చీపురుపల్లి: చీపురుపల్లి సమీకృత వసతి గృహానికి చెందిన పదోతరగతి విద్యార్థి వెంపడాపు పురుషోత్తం శుక్రవారం పాముకాటుకు గురయ్యాడు. ఉదయం సుమారు ఆరున్నర గంటలకు వసతిగృహం నుంచి బయటికి వచ్చిన విద్యార్థికి హాస్టల్ సమీపంలోనే పాము కాటువేసింది. ఆ సమయంలో వసతి గృహంలో సిబ్బంది లేకపోవడంతో తోటి విద్యార్థులు అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స చేయించారు. కాగా వైద్యుడు డా. కె. కుమార్ మాట్లాడుతూ, విద్యార్థికి విష సర్పం కాటు వేసిందని, అయి నప్పటికీ అతని పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. పురుషోత్తం మాట్లాడుతూ ఇంటి నుంచి నిన్ననే వసతి గృహానికి వచ్చానని, టూత్ బ్రష్ లేకపోవడంతో బయటికి వచ్చానని వివరించాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని తహసీల్దార్ ఎన్. రాజారావు, వైసీపీ నాయకులు అనంతరం, శ్రీనివాసనాయుడు తదితరులు పరామర్శించారు. కాగా, పట్టణానికి దూరంగా కొండ ప్రాంతంలో ఉన్న వసతి గృహంలో ఎప్పటికప్పుడు ఇటువంటి సంఘటనలు జరుగుతుండడం పట్ల విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ● దీనిపై హాస్టల్ అడ్మిన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆ సమయంలో తాను హాస్టల్లో లేనని, 6.30 ప్రాంతానికి హాస్టల్‌కు వచ్చి విధుల్లో చేరానని, వెంటనే విద్యార్థిని హాస్పిటల్‌కు తీసుకువెళ్లానని తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వసతిగృహ విద్యార్థి పురుషోత్తం

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

శృంగవరపుకోట: మండల కేంద్రమైన శృంగవరపుకోట ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అరుకు నుంచి విశాఖపట్నం వైపు తీసుకెళ్తున్న ఆరుకేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ వీఎస్ మూర్తి తెలిపారు. ఈవిషయంపై శుక్రవారం ఆయన మట్లాడుతూ ఎస్ఐ గంగరాజు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఒక స్కూటీని ఆపి తనిఖీచేయగా అల్లూరి జిల్లా అరుకువేలికి చెందిన శెట్టి ఉదయ్‌కుమార్, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఏసు వద్ద గంజాయి గుర్తించామన్నారు. వెంటనే వీరిని అదుపులోకి తీసుకుని ఆరుకేజీలు గంజాయి, స్కూటీ వాహనంతో పాటు ఇద్దరినీ అరెస్ట్ చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

బాధితులకు అండగా ప్రభుత్వం



బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

గరివిడి: అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన, గాయపడిన బాధితు లు అందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఆదు కుంటుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. అర్థమూరు గ్రామానికి చెందిన నారాయణ రావు అనే వ్యక్తి ఈ ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఆయన భార్య స్వాతికి రూ.కోటి చెక్కును ఎమ్మెల్యే కళా వెంకటరావు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద మొత్తాన్ని నష్ట పరిహారంగా ఇవ్వలేదని అన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండదండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ బాపిరాజు, పార్టీ నేతలు కె.త్రిమూర్తులురాజు, పైల బలరాం, సారిపాక సురేష్ కుమార్, మహంతి రమణమూర్తి, వెంపడాపు రమణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు భవనాలు మంజూరు చేయండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

చీపురుపల్లి/గరివిడి: చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అదనపు భవనాలు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను నియోజవర్గ బీజేపీ కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంత్రి సత్యకుమార్‌ను విశాఖపట్నంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేశారని, అయినప్పటికీ అదనపు భవనాలు మంజూరు కాలేదన్నారు. 160 కేవీ జనరేటర్, సోలార్ ప్యానెళ్లు, స్కానింగ్ మిషన్, ఇతర ముఖ్యమైన పరికరాలు సరఫరా కాలేదన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని శ్రీనివాసరావు కోరారు.

బేబీనాయనను కలిసిన సినీ రచయిత సాయిమాధవ్



బేబీనాయనతో చర్చిస్తున్న సాయిమాధవ్

బొబ్బిలి: బొబ్బిలి-విజయనగరం రాజుల మధ్య జరిగిన చారిత్రాత్మ కమైన బొబ్బిలియుద్ధం ఇతర నేపథ్యానికి సంబంధించిన చరిత్ర పై ఆధునిక టెక్నాలజీ సహాయంతో చలనచిత్రాన్ని రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సినీ మాటల రచయిత సాయిమాధవ్ బుర్రా శుక్రవారం బొబ్బిలి రాజవంశీ యులు, స్థానిక ఎమ్మెల్యే అయిన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) తో చర్చలు జరిపారు. బొబ్బిలి చరిత్ర కథను రూపొందిస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి వివరాలను సేకరించేందుకు రాజవంశానికి చెందిన బేబీనాయనతో బొబ్బిలి కోటలో చర్చించారు. నేటి ఆధునిక యుగంలో యువతను విశేషంగా ఆకట్టుకునే రీతిలో సినిమాను రూపొందించేందుకు సంకల్పించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని బేబీనాయన హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు



పోలీసు సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వేల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎవీ లీలారావు పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి మోక్షం

రాజాం: రాజాం పట్టణంలో ప్రధాన రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం దీనికోసం రూ.6 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో కనీసం రోడ్లకు మరమ్మ తులు చేయలేని అసమర్థ పాలన సాగిందని ఎద్దేవా చేశారు. వాహన ప్రమాదా లలో అనేక మంది మంచాన పడ్డారని.. ఇద్దరు, ముగ్గురు మరణించారని తెలిపా రు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు పెద్ద సంఖ్యలో మరమ్మతులకు గురయ్యాయని మండిపడ్డారు. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్ల డంతో త్వరితగతిన నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

వేపాడ: సోంపురం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను డిప్యూటీ డీఈఓ పి.వి.రమణ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉపాధ్యాయురాలిగా పని చేసి, మరణించిన ఎం.ఈశ్వరి జ్ఞాపకార్థం వారి కుమార్తె పాఠశాలకు రెండు కంప్యూటర్లను అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బీపీఏ రాజు, ఎంఈఓలు భాలభాస్కరరావు, జగదీశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

రామభద్రపురం: ప్రజలంతా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో శుక్రవారం సాయంత్రం రామమందిరం వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించా లన్నారు. మాదకద్రవ్యాల రవాణా, సేవనం చట్టవిరుద్ధమన్నారు. అలాగే సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చట్టాలపట్ల అవగాహన కలిగి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు, ప్రజాప్రతినిదులు, గ్రామస్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ గ్రామంలో శుక్రవారం జాతీయ జల కృషి సుస్థిర కేంద్రం ఆధ్వర్యంలో మత్స్యకార రైతులకు 5 రోజుల శిక్షణా కార్యక్రమం జరిగింది. గ్రామాల్లోని సాగునీటి వనరుల్లో చేపలు, రొయ్యలలను సాగు చేస్తున్న మత్స్యకార రైతులకు ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మంచి యాజమాన్య పద్ధతులు ద్వారా చేపలు, రొయ్యలు పెంపకం గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం.. వైద్యసిబ్బందికి ఆసుపత్రిలో ప్రసవాలు, మాతా శిశు సేవలు, సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఈ-పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

బొబ్బిలి రూరల్: మెట్టవలస గ్రామంలో శుక్రవారం ఈ-పంట నమోదు కార్యక్రమం ప్రారంభించామని గ్రామ వ్యవసాయ సహాయకుడు బి.రాజశేఖర్ తెలిపారు. గ్రామంలో రైతులందరూ తమ పంట పొలాల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలన్నారు.

అష్టలక్ష్మీ సమేత శ్రీనివాస వ్రత మహోత్సవం



బొబ్బిలి: కంచరవీధిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అష్టలక్ష్మీ సమేత శ్రీనివాసా వ్రత మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత టంగుటూరి

- కలెక్టర్ అంబేడ్కర్
- జిల్లా వ్యాప్తంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

కలెక్టరేట్: స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాతని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ముందుగా టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, చదువుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకున్నా రని తెలిపారు. టంగుటూరి 1952లో ఎస్.కోట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారని, మన జిల్లాతో ఆయనకు అనుబంధం ఉండటం విశేషమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అనిత, జిల్లా బీసీ సంక్షేమాదికారి సందీప్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో దేవి ప్రసాద్ తదితరులు ఉన్నారు. ● టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.



కలెక్టరేట్: టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్



శృంగవరపుకోట రూరల్: ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో..



బొబ్బిలి రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో జేసీ సేతు మాధవన్, ఎమ్మార్వో శ్రీను ఆధ్వర్యంలో..



గరివిడి: తాటిగూడ జడ్పీ ఉన్నత పాఠశాలలో..



రామభద్రపురం: నాయుడువలస ప్రభుత్వ పాఠశాలలో..



భోగాపురం: తహసీల్దార్ కార్యాలయంలో..



తెర్లాం: కూనాయవలస ఎంపీపీ పాఠశాలలో..

ఘనంగా అంతరిక్ష దినోత్సవం

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో ఆధ్వర్యంలో విద్యార్థులతో స్పేస్ మోడల్స్‌ను తయారు చేయించి అవగాహన కల్పించారు. కల్లేపల్లి-రేగ జడ్పీ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు అంతరిక్ష వాహక నౌక మోడల్ తయారు చేసి అవగాహన కల్పించారు. ఎంజేపీ పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ● **రాజాం:** స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తం, సీహెచ్ రవీంద్ర కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొట్టక్కి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రాకెట్ నమూనా ప్రదర్శన ఆకట్టుకుంది. సైన్స్ టీచర్ షేక్ షరీఫ్, పీడీ బొత్స రత్నకిశోర్ ఆధ్వర్యంలో విద్యార్థులు రాకెట్ నమూనాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డా.రావాడ భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లక్కవరపుకోట: ఎంజేపీ పాఠశాలలో రాకెట్ నమూనాతో విద్యార్థులు



రామభద్రపురం: కొట్టక్కి జడ్పీ హైస్కూల్‌లో రాకెట్ ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

ఆలయాలకు శ్రావణ శోభ

రాజాం రూరల్: రాజాం పట్టణ, పరిసర ప్రాంతాలలోని ఆలయాల్లో శుక్రవారం శ్రావణ శోభ కనిపించింది. శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నవదుర్గ అమ్మవారి దేవస్థానంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి శుక్రవారం రాత్రి వరకూ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ● **బొబ్బిలి:** స్థానిక సింగారపు వీధి శ్రీవైభవవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీధనలక్ష్మి అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ఇలా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు.



బొబ్బిలి: అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం



రాజాం రూరల్: మహాలక్ష్మీ దేవికి పూజలు చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా..

సీఐగా శంకరరావు బాధ్యతల స్వీకరణ

చీపురుపల్లి: చీపురుపల్లి సీఐగా నియమితులైన జి.శంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్ప టివరకూ అనకాపల్లిలో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీహెచ్ షణ్ముఖరావు కొత్తవలసకు బదిలీపై వెళ్లారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన శంకరరావును సర్కిల్‌లోని ఎస్‌ఐలు మర్యాదపూర్వంగా కలిశారు.

బాల్య వివాహం నిలిపివేత

గుర్ల: పీఆర్‌పేట గ్రామంలో శుక్రవారం రాత్రి జరగాల్సిన ఓ పెళ్లి ఆగిపోయింది. పెళ్లి కుమార్తెకు వయస్సు తక్కువగా ఉండడంతో అందిన సమాచారం మేరకు ఐసీడీఎస్, పోలీసు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని, వివాహాన్ని నిలిపివేశారు. కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఏఎస్‌ఐ కామేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శకుంతల, రాధిక, మహిళా పోలీసు, రెవెన్యూ సిబ్బంది వారికి నచ్చజెప్పారు. దీంతో వారు పెళ్లిని రద్దు చేసేందుకు అంగీకరించారు.

కర్లాంలో నేత్ర వైద్య శిబిరం

చీపురుపల్లి: కర్లాంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 162 మందికి సేవలందించా రు. చీపురుపల్లి పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో విజయ నగరానికి చెందిన పుష్పగిరి కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 72 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ శిబిరంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు, వైద్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రమాద ఘటనపై న్యాయ విచారణ చేయాలి

నెల్లిమర్ల: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనపై న్యాయ విచారణ చేయాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. నెల్లిమర్లలోని ఐఎంఎల్ డిపో ఎదుట శుక్రవారం ఏపీ బెవరేజేస్ కార్మికులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రక్షణ, భద్రత కల్పించాలని కోరారు. అచ్యుతాపురంలో ఈఎస్‌ఐ సూపర్‌స్పెషాలిటీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు రమణ, శ్రీను, డిపో మేస్త్రీ కార్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ కరువు

పూసపాటిరేగ: పరిశ్రమల యాజమాన్యాలకు లాభాలపై ధ్యాస తప్ప కార్మికుల రక్షణ విషయం పట్టడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ అన్నారు. పూసపాటిరేగ సమీప మైలాన్ పరిశ్రమ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి.. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. మైలాన్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.పుల్లయ్య, నాయకులు ఎ.త్రినాథరావు, ఆదినారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.





నెల్లిమర్ల: నిరసన తెలుపుతున్న కార్మికులు, పూసపాటిరేగ: మైలాన్ పరిశ్రమ ముందు ఆందోళన

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రప్పలనాయుడు

దత్తిరాజేరు: మండల శాఖాధికారులంతా సమన్వ యంతో పనిచేయాలని ఎంపీపీ గేదెల సింహాద్రప్పల నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ఏవో అనూరాధ మాట్లాడుతూ ఆర్బీకేల్లో ఎరువులు అందుబా టులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల పంపిణీ విషయంలో అధికార పార్టీ నాయకులతోపాటు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కలుపుకొనిపోవాలని ఎంపీపీ సూచించారు. ఎరువులను సర్దుబాటు చేసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు భమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్‌నాయుడు, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీవో ఎంవీ సుబ్రహ్మణ్యం, మండల శాఖాధికారులు పాల్గొన్నారు.

పార్టీ అభిమానులకు సత్కారం

చీపురుపల్లి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలిస్తే కాలి నడకన అయ్యప్ప దర్శనానికి వస్తామని మొక్కుకొని.. విజయం అనంతరం శబరిమలకు వెళ్లివచ్చిన అభిమానులు వలిరెడ్డి శ్రీరాములు, మరో ఇద్దరు స్వాములను ఎమ్మెల్యే కళా వెంకటరావు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పీకే పాలవలసకు చెందిన నాయకుడు వలిరెడ్డి శ్రీరాములు గురుస్వామి.. కూటమి విజయం కోసం మొక్కుకున్నారు. రాష్ట్రంలో కూటమి విజయం సాధించి, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో జూన్ 26న పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 53 రోజుల్లో దాదాపు 1,480 కిలోమీటర్లు ప్రయాణం చేశారు. ఈ నెల 18న శబరిమల చేరుకొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు... శ్రీరాములుతో పాటు ఎం.మోహన్, జి.కృష్ణలను సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరివిడి: గరివిడి పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ పూడి హరి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ మరమ్మతుల సందర్భంగా విద్యు త్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.